క్లుప్తంగా

రేపు గోవిందరాజస్వామి ఆలయంలో పౌర్ణమి గరుడ సేవ

తిరుపతి కల్చరల్: పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం గోవిందరాజస్వామి వారి గరుడ సేవ వేడుకగా జరుగనుంది. ప్రతి నెలా పౌర్ణమి పర్వదినాన గరుడ సేవ నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు గోవిందరాజస్వామి వారు గరుడుని అధిరోహించి ఆలయ ప్రధాన వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు.

నోటు పుస్తకాల పంపిణీ



విద్యార్థులతో ఉపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యులు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి ఎస్వీయూ క్యాంపస్ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో 50 మంది విద్యార్థులకు శనివారం నందనం ఫౌండేషన్ సభ్యులు నోటు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్వీయూ నాయకులు కె.ధనుంజయులు నాయుడు, నందనం ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ పత్తిపాటి వివేక్, శివాజీ, హెచ్ఎం పి.మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ



లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్న ముద్రనారాయణ, ఎస్‌కె.బాబు

తిరుపతి మంగళం: తిరుపతి 12వ డివిజన్‌లోని పింఛనుదారులకు శనివారం డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్‌కె. బాబు పింఛన్లు అందజేశారు. వారు మాట్లాడుతూ గతంలో సామాజిక పింఛన్ల కోసం వృద్ధులు, వికలాంగులు గంటల తరబడి కార్యాలయాల వద్ద వేచి ఉండాల్సి వచ్చేదన్నారు. నేడు ప్రతినెలా ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటి వద్దకే వచ్చి అందజేస్తున్నట్టు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి పరిపాలన సాగిస్తున్న జగనన్నకు ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు, సచివాలయ సెక్రటరీ శ్రీనివాసులు, వలంటీర్ శంకరి పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా పంచాయతీల అభివృద్ధి



రణధీర్‌పురం పంచాయతీ గ్రామసభలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

తిరుపతి మంగళం: చరిత్రలో నిలిచిపోయేలా మంగళంలోని సప్తగిరినగర్, రణధీర్‌పురం పంచాయతీలను అభివృద్ధి చేస్తున్నట్టు సప్తగిరినగర్ పంచాయతీ ఉపసర్పంచ్ అశోక్‌రెడ్డి, రణధీర్‌పురం పంచాయతీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయా పంచాయతీల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు స్థానికులు మాట్లాడుతూ దోమల బెడద ఎక్కువగా ఉందని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు నాగభూషణమ్మ, పి.లీలావతి, ఉపసర్పంచ్ మల్లెమొగ్గల ఉమాపతి, మార్కెట్ యార్డు డైరెక్టర్ మహ్మద్‌ఖాసీమ్, వార్డు మెంబర్లు మురళి, రజాక్, సతీష్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశాల నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం శానంబట్ల పంచాయతీ కొత్త శానంబట్ల గ్రామంలో త్వరలో పశు వైద్యశాల ఏర్పాటు చేయనున్నారు. గ్రామంలో పశువైద్యశాల ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతూనే ఉన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చొరవ తీసుకుని భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. స్థలం లేకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. గ్రామానికి చెందిన మునిరత్నం రెడ్డి తన పొలాన్ని విరాళంగా ఇవ్వడంతో ఆసుపత్రి భవన నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు. తుడా నిధులతో జగనన్న సమావేశ మందిరం పనులను కూడా ప్రారంభించనున్నారు. అదే గ్రామానికి చెందిన నరసింహారెడ్డి తన కుమారుని జ్ఞాపకార్థం ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలం కేటాయించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, నేతలు సురేష్ రెడ్డి, శంకర్ యాదవ్, ఎంపీడీవో రమేష్ శనివారం స్థలాలను పరిశీలించారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

- ప్రజల వద్దకే పరిపాలన
- సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం
- మేయర్, డిప్యూటీ మేయర్ శిరీష, భూమన అభినయ్‌రెడ్డి
- డిప్యూటీ మేయర్ భుమన అభినయ్ రెడ్డి
- తిరుపతిలో ఘనంగా ప్రారంభమైన జగనన్న సురక్ష
- తొలి రోజే 2559 మందికి సేవలు



తిరుపతి: జగనన్న సురక్ష కార్యక్రమంలో వివిధ సేవలు పొందుతున్న ప్రజలు



పాకాల: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు



లబ్ధిదారుడికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి



భాకరాపేట: సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



తిరుపతిలోని 42, 43వ డివిజన్లలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ, కమిషనర్ హరిత, ఆర్డీవో కనకనరసారెడ్డి



తిరుపతి రూరల్ : అవిలాలలో సర్టిఫికెట్లు అందజేస్తున్న జేసీ బాలాజీ, ప్రజాప్రతినిధులు

తిరుపతి తుడా: జగనన్న ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని మేయర్ శిరీష తెలిపారు. తిరుపతిలోని 40, 41, 42, 43 డివిజన్లు, 8వ వార్డు సచివాలయాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు ప్రాంతాల్లో తొలిరోజు 2,559 మందికి ప్రభుత్వ సేవలు అందించారు. మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ఇంటి వద్దకే తీసుకువచ్చిన ఘనత సీఎం జగనన్నకు దక్కుతుందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా దరఖాస్తుదారులకు గంటల వ్యవధిలోనే ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు చెప్పారు. 11 రకాల ప్రభుత్వ సేవలను నగదు రహితంగా అందజేసినట్టు తెలిపారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పరిపాలన సాగిస్తున్నారని కొనియాడారు. గతంలో ధ్రువీకరణ పత్రాల కోసం నగదు చెల్లించడంతోపాటు వారాల కొద్ది ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులు ఉండేవని గుర్తు చేశారు. జగనన్న సురక్ష ద్వారా గంటల వ్యవధిలోనే నగదు చెల్లించకుండా ప్రభుత్వ సేవలు అందిస్తున్నట్టు వివరించారు. నగర ప్రజలు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హత ఉండి వివిధ కారణాలతో సంక్షేమ పథకాలు పొందలేని ప్రజలకు జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతో దోహద పడుతుందన్నారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ మాట్లాడుతూ పేద ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన రావాలంటే మంచి మనసు ఉండాలన్నారు. అలాంటి సహృదం కలిగిన ఏకైక నాయకుడు జగనన్న మాత్రమేనన్నారు. కొన్ని దుష్టశక్తులు ప్రజలకు మంచి జరగకూడదని అడుగడుగునా అడ్డుపడుతున్నట్టు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు లడ్డూ భాస్కర్, శేఖర్‌రెడ్డి, రాధాయాదవ్, పుణీత, రామస్వామి వెంకటేశ్వర్లు, నరసింహ ఆచారి, మునిరామిరెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు వెంకటరెడ్డి, అదనపు కమిషనర్ సునీత, ఆర్డీవో కనకనరసారెడ్డి, అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

2,559 మందికి ప్రభుత్వ సేవలు

జగనన్న సురక్ష కార్యక్రమంలో తొలిరోజే మూడు ప్రాంతాల్లో వివిధ ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాల కోసం 2,938 మంది దరఖాస్తు చేసుకోగా గంటల వ్యవధిలోనే 2559 మందికి అధికారులు ప్రభుత్వ సేవలను అందించారు. కొన్ని కారణాలతో మిగిలిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలిస్తున్నారు.

1010 సర్టిఫికెట్ల మంజూరు

పాకాల: మండలంలోని ఇరంగారిపల్లిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలను త్వరితగతిన పరిష్కరించాలనే ఉద్దేశంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. ఇరంగారిపల్లి పంచాయతీలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను పరిష్కరించారని పేర్కొన్నారు. పంచాయతీలో 494 కులం, 515 ఆదాయం, ఒకటి వివాహ ధ్రువీకరణ పత్రాలతోపాటు 22 ఆధార్ సేవలను అందించినట్టు తెలిపారు. తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ కస్తూరి, సర్పంచ్ వసంత, ఈవోపీఆర్డీ మాలతి, పీఆర్ ఏఈ నాగేంద్ర, పంచాయతీ కన్వీనర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రామచంద్రాపురం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగనన్నకే సాధ్యమైందని ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. మండలంలోని సొరకాయలపాలెంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సొరకాయలపాలెం సచివాలయ పరిధిలో రూ.30 వేల రుసుము గల 703 సర్వీసులను ఉచితంగా అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీవో రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో మహ్మద్‌రఫీ, తహసీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ కవిత పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సత్వర సేవల కోసమే జగనన్న సురక్ష అమలు

భాకరాపేట: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎర్రావారిపాళెం ఎంపీపీ శివలక్ష్మీ పేర్కొన్నారు. మండలంలోని యల్లమంద గ్రామ సచివాలయం వద్ద శనివారం జగనన్న సురకక్ష కార్యక్రమం నిర్వహించారు. అర్హులై ఉండి సాంకేతిక కారణాలతో పథకాలు అందని వారికి న్యాయం చేయాలనే జగనన్న సురక్ష నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా సచివాలయంలో 230 మందికి సర్టిఫికెట్లు, 20 ఆధార్‌లో మార్పులు చేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీవో అమర్నాథ్, తహసీల్దార్ దస్తగిరయ్య, సర్పంచ్ నాగలేఖ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ప్రభుత్వ సేవలు

తిరుపతి రూరల్: అర్హులకు పారదర్శకంగా వేగవంతమైన సేవలు అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ బాలాజీ తెలిపారు. ఆయన శనివారం అవిలాల సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలిరోజు 1,037 సేవలకు సంబంధించి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. పలు అర్జీలను పరిష్కరించారు. కార్యక్రమం అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సీవీ రమణ, జెడ్పీటీసీ రత్నమ్మ, వైస్ ఎంపీపీ వేముల యశోద, ఎంపీడీఓ వెంకటనారాయణ, తహసీల్దార్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

తప్పులు లేకుండా ఓటర్ల జాబితా



మాట్లాడుతున్న ఆర్డీవో కనకనరసారెడ్డి

తిరుపతి అర్బన్: తప్పులు లేకుండా కచ్చితమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని చంద్రగిరి ఈఆర్‌ఓ, తిరుపతి ఆర్డీవో కనకనరసారెడ్డి తెలిపారు. ఆయన శనివారం తన కార్యాలయంలో 2024 ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ చిన్న పొరబాట్లకు కూడా తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. షెడ్యూల్‌కు ముందే అవగాహనా కలిగి కచ్చితమైన జాబితా తయారీలో భాగస్వామ్యులు కావాలని వెల్లడించారు. ప్రధానంగా ఒకే ఇంటిలో 10 మందికి పైగా ఓటర్లు ఉంటే గుర్తించాలని, ఒకే కుటుంబం వారు ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేలా, ఇంటి నంబర్లు జీరో లేకుండా జాబితా తయారు చేయాలని ఆదేశించారు. ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 29 వరకు ఓటరు జాబితా సవరణ నిమిత్తం బీఎల్‌వోలు ప్రతి గడపకూ వెళ్లాలని, అవసరమైన చోట పోలింగ్ కేంద్రాల మార్పు తదితర అంశాలను వెల్లడించాలని చెప్పారు. అక్టోబర్ 17న ముసాయిదా జాబితా ప్రచురించాలని, నవంబర్ 30 వరకు మార్పులు చేర్పులు చేయాలని తెలిపారు. పూర్తిస్థాయిలో సవరించిన ఓటరు జాబితాను 2024 జనవరి 5న ప్రచురించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో తెలుగుదేశం నుంచి నాని, కాంగ్రెస్ నుంచి నారాయణ స్వామి, బీజేపీ దీనదయాళ్, చంద్రగిరి ఏఈఆర్‌వో, తహసీల్దార్ శిరీష, చిన్నగొట్టిగల్లు తహసీల్దార్ లోకేశ్వరి, డీటీ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన హరికథా గానం

తిరుపతి కల్చరల్: ధర్మప్రచారంలో భాగంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో గోవిందరాజస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం నుంచి ప్రతిరోజూ హరికథా గానం చేపట్టారు. తొలి రోజు భాగవతారిణి వరలక్ష్మీ సుందరకాండపై గానం చేశారు. హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి శ్రీనివాసులు, ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, డీపీపీ ఏఈవో శ్రీరాములు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పట్టాల పంపిణీ



పట్టాలు అందజేస్తున్న సర్పంచ్ అగరాల భాస్కర్‌రెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం జగనన్న కాలనీలో ఇళ్ల లబ్ధిదారులకు శనివారం ఇంటి పట్టాలను సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డి పంపిణీ చేశారు. కోర్టు కేసులు కారణంగా పట్టాల పంపిణీ ఆలస్యమైంది. కోర్టు కేసుల నుంచి ఊరట లభించడంతో ప్రస్తుతం అగరాలకు చెందిన పలువురు లబ్ధిదారులు గృహాలు నిర్మించుకుంటున్నారు. సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి, మాజీ ఎంపీటీసీ మురగయ్య, నాయకులు బాలకృష్ణ, పఠాన్ రహీం, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యపరీక్షలు చేయించుకోండి



వైద్యులను సన్మానిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి నియోజకవర్గ ప్రజలందరూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్యపరీక్షలను చేయించుకోవాలని ఆయన తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరాలకు వెళ్లి రక్త నమూనాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. శనివారం చంద్రగిరి మండలం, శానంబట్ల, తొండవాడ, పిచ్చినాయుడుపల్లి, రాయలపురం పంచాయతీల పరిధిలో జరిగే ఉచిత ఆరోగ్య శిబిరాలను పర్యవేక్షించారు. అక్కడ జరుగుతున్న రక్త పరీక్షలు, గుండె పరీక్షలు, వైద్యుల పరిశీలన, ప్రజలకు అందించే అల్పాహారం, భోజనం సదుపాయాలపై చర్చించారు. అనంతరం గ్రామంలో కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా నిర్వహించే ఆరోగ్య పరీక్షలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముందస్తుగా రక్తపరీక్షలు చేయించుకుంటే ఆకస్మిక మరణాలను కొంతవరకు తగ్గించవని వైద్యులు సూచిస్తున్నట్టు పేర్కొన్నారు. అనంతరం డాక్టర్స్‌డే సందర్భంగా ఉచిత వైద్యశిబిరంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్లను ఘనంగా సత్కరించారు.

ఎస్వీయూ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నరసయ్య



తిరుపతి ఎడ్యుకేషన్ : ఎస్వీయూ కామర్స్, మేనేజ్‌మెంట్ అండ్ కంప్యూటర్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ నరసయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన ప్రొఫెసర్ పద్మావతమ్మ పదవీ కాలం ముగిసింది. ఆయన రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఆయన ఎస్వీయూ కామర్స్, మేనేజ్‌మెంట్ అండ్ కంప్యూటర్ సైన్స్ కళాశాల బాలుర వసతి గృహం వార్డెన్‌గా, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతిగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, వైస్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను నిర్వహించారు. ఇప్పటి వరకు 17కు పైగా పీహెచ్‌డీ డిగ్రీలు ప్రదానం చేశారు. ప్రొఫెసర్ నరసయ్యను ప్రిన్సిపాల్‌గా నియమించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. అలాగే వైస్ ప్రిన్సిపాల్‌గా వాణిజ్యశాస్త్ర విభాగపు ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వర్లు నియమితులయ్యారు.

కల్యాణ వెంకన్న సేవలో ప్రముఖులు



సుప్రీంకోర్టు న్యాయమూర్తి మనోజ్‌మురా



ఉడిపి మఠం పీఠాధిపతి వేదమర్ధనతీర్థ స్వామీజీ

చంద్రగిరి(తిరుపతి రూరల్): శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామిని శనివారం ప్రముఖులు దర్శించుకున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి మనోజ్‌మురా కుటుంబ సభ్యులతో స్వామి వారి దర్శనం కోసం విచ్చేశారు. ఉడిపి మఠం పీఠాధిపతి వేదవర్ధనతీర్థ స్వామీజీ శిష్య బృందంతో విచ్చేశారు. వారికి ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి వారి దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థప్రసాదాలను అందించారు.

ఘనంగా డాక్టర్స్ డే





సిపాయి సుబ్రమణ్యంను సత్కరిస్తున్న నేతలు, రుయా అధికారులను సత్కరిస్తున్న బండ్ల చంద్రశేఖర్ రాయల్



చిన్నారులతో పూర్వ విద్యార్థులు, లిటిల్ ఏంజిల్స్ పాఠశాల యాజమాన్యం

తిరుపతి తుడా: తిరుపతిలో శనివారం డాక్టర్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. రష్ ఆసుపత్రి అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, రమాదేవి ఆసుపత్రి అధినేత, సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ రాధాకృష్ణా రెడ్డిని ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది సత్కరించారు. రుయా అభివృద్ధి కమిటీ వర్కింగ్ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్ రాయల్ రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, ఏఆర్‌ఎంఓలు యువఅన్వేష్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈఎస్‌ఐ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్‌తోపాటు వైద్యులను సత్కరించారు.

లిటిల్ ఏంజిల్స్‌లో..

తిరుపతి కల్చరల్: తిరుపతి యశోదానగర్‌లోని లిటిల్ ఏంజిల్స్ పాఠశాలలో శనివారం డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు కార్డియాలజిస్ట్ డాక్టర్ వికాస్, గైనకాలజిస్ట్ డాక్టర్ లావణ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చిన్నారులు డాక్టర్ల వేషధారణలో సందడి చేశారు. పాఠశాల చైర్ పర్సన్ రమాదేవి మాట్లాడుతూ 43 ఏళ్లలో వేలాది మంది విద్యార్థులను డాక్టర్స్‌గా తీర్చిదిద్దిన ఘనత లిటిల్ ఏంజిల్స్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్వేత, ప్రిన్సిపాల్ పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

యూత్ హాస్టల్‌లో..

తిరుపతి రూరల్: ఉమ్మడి చిత్తూరు జిల్లా కమ్యూనిటీ పారామెడిక్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం తిరుపతి యూత్ హాస్టల్లో డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. జిల్లా కన్వీనర్ మన్నారు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్లు కనిపించే దేవుళ్లని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంను ఘనంగా సత్కరించారు.

ప్రైవేట్ విద్యాసంస్థల బంద్ విజయవంతం



నగరంలో ప్రైవేట్ విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్న ఏపీ విద్యార్థి సంఘాల సమాఖ్య నాయకులు

తిరుపతి ఎడ్యుకేషన్: ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల అధిక ఫీజుల దోపిడీని నిరసిస్తూ శనివారం తిరుపతి నగరంలో ఏపీ విద్యార్థి సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో చేపట్టిన ప్రైవేట్ విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రియాదవ్ మాట్లాడుతూ నగరంలో పలు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వసతులను కల్పించడం లేదని, అర్హత కలిగిన టీచర్లను నియమించడం లేదని దుయ్యబట్టారు. లైబ్రరీ, ప్లే గ్రౌండ్, ల్యాబ్ తదితర సౌకర్యాలు లేకుండా విద్యాసంస్థలను నిర్వహిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ, జీజేఎస్, బీవీఎస్, బీడీఎస్ విద్యార్థి సంఘాల నాయకులు జె.మల్లికార్జున, మహేంద్రనాయక్, చందు, శ్రీధర్, జనార్ధన్, ఎల్లార్తి చంద్రశేఖర్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఛార్టర్డ్ అకౌంటెట్స్ వార్షికోత్సవం



మాట్లాడుతున్న ఎం.సింహాద్రి

తిరుపతి కల్చరల్: తిరుపతి బాలాజీ కాలనీలోని తిరుపతి బ్రాంచ్ ఆఫ్ ఎస్ఐఆర్‌సీ ఆఫ్ ఐసీఏఐ సంస్థ కార్యాలయంలో శనివారం ఛార్టర్డ్ అకౌంటెంట్స్ 75వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ చేవూరి జగదీష్ కృష్ణ ఐసీఏఐ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధిలో సీఏలు గణనీయమైన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అనంతరం సీఏలు, విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు ట్రోఫీలు, బహుమతులు ప్రదానం చేశారు. మొక్కలు పంపిణీ చేశారు. రక్తం దానం చేశారు. కార్యక్రమంలో ఐసీఏఐ ఉపాధ్యక్షుడు జి.రవీంద్రారెడ్డి, కార్యదర్శి డీవీ.మధుసూదన బాబు, కోశాధికారి ఎం.సింహాద్రి, విద్యార్థుల సమాఖ్య అధ్యక్షుడు కె.బాలాజీ, పూర్వ అధ్యక్షుడు సి.నరసింహులు పాల్గొన్నారు.

కృష్ణమనాయుడు కుంటకు పూర్వ వైభవం



పనులను పరిశీలిస్తున్న మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్లు అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ

తిరుపతి తుడా: తిరుపతి చెన్నారెడ్డి కాలనీలో చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన కృష్ణమనాయుని కుంటకు పూర్వవైభవం తీసుకొస్తున్నట్టు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం మేయర్ శిరీష, కమిషనర్ హరితతో కలిసి కృష్ణమనాయుడు కుంట ఆధునికీకరణ పనులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ పూరాతన కుంట శిథిలావస్థకు చేరుకుని డంపింగ్ యార్డును తలపించేదన్నారు. దీనిపై ప్రజలు ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డికి ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సూచనలతో ఈ కుంటను ఆధునీకరిస్తున్నట్టు వివరించారు. పనులను వేగవంతం చేసి త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్పొరేటర్లు పుణీత, రామస్వామి వెంకటేశ్వర్లు, శేఖర్ రెడ్డి, బొగ్గుల వెంకటేష్, మునిసిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డీఈ గోమతి తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుపతి రైతు బజారులో టమాటాల పంపిణీ

తిరుపతి అర్బన్: తిరుపతి అన్నమయ్య సర్కిల్ సమీపంలోని రైతు బజారులో ఆదివారం టమాటాలు పంపిణీ చేయనున్నారు. జేసీ డీకే బాలాజీ ఆదేశాల మేరకు రైతు బజారులో కిలో టమాటాలు రూ.50కే పంపిణీ చేయనున్నారు. ఆ మేరకు పలమనేరు నుంచి 5 టన్నులు దిగుమతి చేశారు. ఒక్కో వ్యక్తికి కిలో చొప్పున పంపిణీ చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

రామచంద్రాపురం: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డితో కలిసి సీరామాపురం సమీపంలోని బ్రహ్మర్షి ఆశ్రమంలో శనివారం స్విమ్స్ ఆసుపత్రి, అరవింద్ కంటి ఆసుపత్రి సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేస్తున్నామని చెప్పారు.

గోడౌన్ల పరిశీలన

రేణిగుంట: 2024లో జరిగే ఎన్నికల సందర్భంగా తయారు చేసిన బెల్ ఎం3 ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఈవీ ప్యాట్లను భద్రపరిచేందుకు గుర్తించిన రేణిగుంట విమానాశ్రయానికి సమీపంలోని గోడౌన్లను శనివారం కలెక్టర్ వెంకటరమణారెడ్డి పరిశీలించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.